సాక్షి పెద్దపల్లి

బుధవారం । 11 । జనవరి । 2023



జీ-థర్మల్‌లో నిలిచిన విద్యుత్ ఉత్పత్తి

రామగుండం: జీ-థర్మల్‌లో ఎకనామైజర్ ట్యూబ్స్ లీక్ కావడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వార్షిక మరమ్మతులు చేసిన ఐదు రోజులకే అంతరాయం ఏర్పడడంతో మరమ్మతు పనుల్లో ఇంజినీర్లు, అధికారులు నిమగ్నమయ్యారు.



పత్తి క్వింటాల్‌కు రూ.8,261

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో పత్తి క్వింటాల్‌కు రూ.8.261 పలికింది. కనిష్టంగా రూ.7.201. రూ.8.111గా నమోదైనట్లు ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.

గరిష్టం/కనిష్టం
30.0 /12.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది.
ఉదయం పొగమంచు కురుస్తుంది.
చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

విపత్తుల నివారణపై ఎన్డీఆర్‌ఎఫ్ అవగాహన



ప్రదర్శన ఇస్తున్న సిబ్బంది

రామగుండం: విపత్తులపై అవగాహన ఉంటే నివారణ సులభమని ఎన్డీఆర్‌ఎఫ్ 10వ బెటాలియన్ సీఐ జెహెచ్.బిటిన్‌సింగ్ అన్నారు. మంగళవారం అంతర్గాం మండల కేంద్రంలోని రైతుభవన్‌లో విపత్తుల నివారణపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. భూకంపాలు, భారీ వర్షాల ప్రకృతి విపత్తులు సంభవిస్తాయన్నారు. మానవ తప్పిదాలలో గ్యాస్ లీకేజీ, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వంటి విపత్తులు ఏర్పడుతాయని, వీటిపైనా ఎన్డీఆర్‌ఎఫ్‌కు భాగస్వామ్యం ఉంటుందన్నారు. విపత్తు సంభవించినప్పుడు నష్ట నివారణపై మెలకువలు పాటించాలన్నారు. అనంతరం ఇళ్లలో చోటుచేసుకునే గ్యాస్ లీకేజీ, ఆయిల్‌పై మంటలు చెలరేగడం వంటివి నివారించే అంశాలను ప్రయోగాత్మకంగా వివరించారు. తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీఓ యాదగిరి, సూపరింటెండెంట్ మామిడాల కరుణాకర్, ఎంపీపీ దుర్గం విజయ, సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.

పట్టణాల అభివృద్ధికి రూ.130కోట్లు ఇవ్వండి



కేటీఆర్‌ను కలిసి విన్నవిస్తున్న ఎమ్మెల్యే

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి నియోజకవర్గంలోని పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపాలిటీల ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు రూ.130 కోట్లు ఇవ్వాలని పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌ను కలిసి విన్నవించినట్లు ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రమైన పెద్దపల్లి మున్సిపాలిటీలో రోడ్లు, డ్రైనేజీలు, సుందరీకరణ పనులకు రూ.100కోట్లు, సుల్తానాబాద్ మున్సిపాలిటీకి రూ.30కోట్లు మంజూరు చేయాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

జేఎన్టీయూ విద్యార్థుల ప్రతిభ



రామగిరి(మంథని): ఇటీవల హైదరాబాద్‌లో తఫీసా ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీలలో సెంటినరీకాలనీలోని జేఎన్టీయూ విద్యార్థులు బహుమతులు సాధించారు. కళాశాలకు చెందిన సీహెచ్.సీమ, యూ.హర్షిత, ఎస్.రమ్యకృష్ణ, ఎస్.యాదలక్ష్మి కబడ్డీలో ప్రథమ, లాంగ్‌జంప్‌లో ఎం.యాదలక్ష్మి, 100, 200మీటర్ల రన్నింగ్‌లో హరిత ప్రథమ బహుమతి సాధించారు. వీరంతా జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. రెజ్లింగ్ 57 కిలోల విభాగంలో బీమగాని ఫణీంద్రకుమార్ ఆలిండియా అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొననున్నాడు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ బి. విష్ణువర్ధన్ మంగళవారం అభినందించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ పింగిళి కృష్ణారెడ్డి, అసిస్టెంట్ పీడీ ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు

పెద్దపల్లిరూరల్: పంచాయతీల్లో ప్రణాళిక ప్రకారం అభివృద్ధి పనులు చేపట్టాలని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. కలెక్టరేట్‌లో ఎంపీడీఓలతో సమావేశమయ్యారు. జీపీడీపీ అమలు తీరుపై అవగాహన కల్పించారు. సహజ వనరులను వినియోగించుకోవాలన్నారు. అక్టోబర్ 2 నుంచి డిసెంబర్ 31 వరకు ప్లాన్ క్యాంపెయిన్ (సబ్‌కీ యోజన సబ్‌కా వికాస్) నిర్వహించుకుంటున్నామని, పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. ట్రైనర్ కోట సురేందర్ జీపీడీపీ అమలు తీరుపై అవగాహన కల్పించారు. జెడ్పీ సీఈఓ శ్రీనివాస్, డీఆర్‌డీఓ శ్రీధర్, డీఎల్‌పీఓలు పాల్గొన్నారు.

పోర్టు పోలియో జడ్జిల నియామకం

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాలుగు జిల్లాలకు పోర్టుపోలియో జడ్జిలను హైకోర్టు మంగళవారం నియమించింది. కరీంనగర్‌కు జస్టిస్ కన్నెగంటి లలిత, పెద్దపల్లి జిల్లాకు జస్టిస్ ఎస్‌వీ శ్రవణ్‌కుమార్, జగిత్యాల జిల్లాకు జస్టిస్ జి.అనుపమ చక్రవర్తి, సిరిసిల్ల జిల్లాకు జస్టిస్ డి.నాగార్జునను నియమించారు.

పండుగ పూట పడిగాపులు..!



- రేషన్ దుకాణాల్లో ప్రారంభం కాని పంపిణీ
- సాంకేతిక సమస్య అంటున్న అధికారులు
- ఈనెల నుంచి ఒక్కొక్కరికి ఐదు కిలోల బియ్యమే..
- పిండి వంటల వేళ.. కుదింపుపై పేదల అసహనం

మంథని: సంక్రాంతి పండుగ వచ్చిందంటే ఏ ఇంట్లో చూసినా పిండి వంటల ఘుమఘుమలే ఉంటాయి. పండుగకు వారం ముందు నుంచే సకినాలు, గ్యారలు, అరిసెలు, కారపూస, లడ్డూలు, ఇలా పలు రకాల పిండి వంటలను పేదోళ్ల మొదలు ఉన్నత కుటుంబాల వరకు తమ ఇంట్లో తయారు చేసుకుంటారు. వీటికి దొడ్డు బియ్యమే వాడుతారు. సాధారణంగా పండుగ వేళ ప్రభుత్వాలు సబ్సిడీపై పంపిణీ చేసే నిత్యావసర సరుకులను అదనంగా అందిస్తుంటాయి. కానీ ఈసారి మాత్రం పదో తారీఖు దాటినా.. ఇంకా బియ్యం పంపిణీ షురూ కాలేదు. దీంతో సామాన్యులు రేషన్ సరుకుల కోసం పడిగాపులు కాస్తున్నారు.

జిల్లాలో రేషన్ పంపిణీ ఇలా	
చౌకధరల దుకాణాలు	413
రేషన్ కార్డులు	2,10,147
అన్నపూర్ణ కార్డులు	175
అంత్యోదయ	12,297
లబ్ధిదారులు	6,27,841
బియ్యం	3506 టన్నులు

తెరుచుకోని రేషన్ దుకాణాలు

జిల్లాలో 413 రేషన్ దుకాణాలు ఉన్నాయి. 2,10,147కార్డులకు 6,27,841 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రతినెలా 3,506 టన్నుల బియ్యం పంపిణీ చేస్తారు. ప్రతినెలా ఒకటో తేదీ నుంచి 15 వరకు అందిస్తుంటారు. ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే 19వరకూ అందిస్తారు. అయితే ఈనెల 10తేదీ వరకూ పంపిణీయే మొదలు కాలేదు. పది రోజుల నుంచి లబ్ధిదారులు రేషన్ దుకాణాల చుట్టూ తిరుగుతున్నారు. షాపులు మూసి ఉంటుండంతో సామాన్యుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఈ నెల ఐదు కిలోలేనా..?

కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం ద్వారా రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు ఉచితంగా రేషన్ బియ్యం పంపిణీ చేస్తోంది. ఈ ఏడాది మొత్తం ఇలాగే కొనసాగిస్తామని ప్రకటించింది. ప్రతి వ్యక్తికి ఐదు కిలోల చొప్పున కేంద్రం అందించనుండగా.. మరో ఐదు కిలోలు రాష్ట్ర పభుత్వం వాటా కింద ప్రతి లబ్ధిదారుకు ప్రతినెల 10 కిలోలు పంపిణీ చేస్తున్నారు. ఈసారి రాష్ట్ర ప్రభుత్వం నుంచి బియ్యం పంపిణీపై ఎలాంటి ప్రకటనా వెలువడలేదు. దీంతో రేషన్ షాపులకు బియ్యం కూడా సరఫరా రాలేదు. కేవలం కేంద్ర ప్రభుత్వం అందించే ఐదు కిలోల బియ్యమే ఇస్తారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కుదింపుతోనే సాంకేతిక సమస్య

రేషన్ దుకాణాల్లో బయోమెట్రిక్ విధానం ద్వారా ఉచిత బియ్యం పంపిణీ చేస్తున్నారు. కార్డులోని ప్రతి వ్యక్తికి పది కిలోలకు బదులు ఈసారి ఐదు కిలోల బియ్యం సరఫరా కానుండడంతో బయోమెట్రిక్ యూనిక్ కోడ్‌లో సాంకేతిక సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది. రేషన్‌షాపుల్లోని బయోమెట్రిక్ మిషన్లు పనిచేయడం లేదని డీలర్లు అంటున్నారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కారమవుతుందని అధికారులు చెబుతున్నారు. ఏదిఏమైనా సంక్రాంతి పండుగ వేళ ఉచిత బియ్యం పంపిణీలో గందరగోళం నెలకొనడంతో పేదల్లో అసహనం వ్యక్తమవుతోంది.

పండుగవేళ ఆలస్యమా..



ప్రతినెలా ఒకటో తేదీ నుంచి ప్రారంభించే రేషన్ బియ్యం ఈసారి ఆలస్యం కావడంతో ఇబ్బందిగా ఉంది. సంక్రాంతి పండుగ సమయం కావడంతో ముందుగానే ప్రారంభించాల్సిన పంపిణీ ఆలస్యం చేయడం సరికాదు. అధికారుల నిర్లక్ష్యంతోనే ఇలా జరిగి ఉండవచ్చు. ముందు చూపు లేకుండా పేదలకు అసౌకర్యం కలిగించొద్దు.

– బెజ్జంకి డిగంబర్, లబ్ధిదారు, మంథని

సాంకేతిక సమస్యతోనే..



రేషన్ బియ్యం పంపిణీకి సాంకేతిక సమస్యలు వచ్చాయి. ఈ కారణంగానే రేషన్ దుకాణాకు బియ్యం సరఫరా ఆలస్యమైంది. సమస్య పరిష్కారం కాగానే ప్రతిఒక్కరికీ బియ్యం అందిస్తాం.

– వెంకటేష్, డీఎస్‌ఓ

అందుబాటులో ఉంటా.. ఆన్‌లైన్‌లోనూ స్పందిస్తా..



పెద్దపల్లిరూరల్: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటా.. ఎవరైనా ఆన్‌లైన్‌లో.. లేదా మొబైల్ ఫోన్‌ద్వారా సమస్య చెప్పినా వీలైనంతవరకు పరిష్కారం చూపుతున్న. భూ వివాదాలు పరిష్కరించాలనే ఆలోచనతో జిల్లావ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించాం. సాగు భూమిలో కొంత ఇరిగేషన్‌శాఖకు పోయిందనే కారణంతో ఇబ్బంది పడే రైతులు అవార్డు తీసుకోలేదని ఆధారాలతో వస్తే నోషనల్ ఖాతా ద్వారా సరిచేస్తున్నాం. ప్రభుత్వభూముల్లో కబ్జాకు ఉన్నా డిజిటల్ సంతకం పెండింగ్‌లో ఉండడం వంటి సమస్యలకు వీలైనంత పరిష్కారం చూపుతున్నాం. కస్టం మిల్లింగ్ రైస్ విషయంలో నిబంధనలు పాటించని 36 రైస్‌మిల్లులకు నోటీసులిచ్చాం. సివిల్ సప్లయ్ గోదాంలో అవకతవకలు జరిగాయంటూ అందిన ఫిర్యాదుపై గోదాం అధికారిని సస్పెండ్ చేసి విచారణ చేపట్టాం..' అని జిల్లా అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. భూ సంబంధమైన అనేక సమస్యలు, స్లాట్ బుకింగ్ అయ్యాక రద్దు చేస్తే తలెత్తే ఇబ్బందులు, పోడు భూముల కేటాయింపు పొరపాట్లు, మిల్లర్లకు సంబంధించిన అనేక అంశాలపై మంగళవారం 'సాక్షి'తో మాట్లాడారు.

'సాక్షి' ఇంటర్వ్యూలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ

- 'ధరణి' ఇబ్బందులు దాదాపు దూరం
- నోషనల్ ఖాతాలో పడితే ఆధారాలిస్తే చాలు
- పోడు భూమికి అర్హులు నలుగురే
- జీఓ 76 ప్రకారం సింగరేణి భూమి 1100 మందికి
- సీఎంఆర్ సమస్యలు కొలిక్కి
- సివిల్ సప్లయ్ గోదాం అవకతవకలపై విచారణ
- అధికారులు బాధ్యతగా పనిచేస్తేనే గుర్తింపు

సాక్షి: 'ధరణి' ఏర్పాటు తో వచ్చిన ఇబ్బందులపై..?

అడిషనల్‌కలెక్టర్: ధరణి పోర్టల్ అందుబాటులోకి వచ్చాక కొన్ని సమస్యలు వచ్చాయి. పోర్టల్‌లో అందుబాటులో ఉన్న ప్రకారం పరిష్కరిస్తున్నాం. ఇపుడు కొత్తగా వచ్చిన ఆప్షన్లతో భూ సమస్యలు దాదాపుగా కొలిక్కి వచ్చాయి.

సాక్షి: డిజిటల్ సంతకం అభ్యంతరాలపై...?

అడిషనల్‌కలెక్టర్: రికార్డులకు, వాస్తవికతకు మధ్య తేడా ఉన్న వాటి విషయంలో డిజిటల్ సంతకాలు పెండింగ్‌లో ఉన్నాయి. మిస్సింగ్ సర్వే నంబర్లు, పాస్‌బుక్ ఉండి భూమిలేక పోవడం వంటి సమస్యలపై విచారణ జరిపి తేడాలను సవరించాల్సి ఉంటుంది.

సాక్షి: రైతులే సాగు చేస్తున్నా.. ఇరిగేషన్ ఆధీనంలో ఉందని రికార్డుల్లో ఎలా..?

అడిషనల్‌కలెక్టర్: ఎస్సారెస్పీ కాలువలు, నీటి వనరులున్న ప్రాంత రైతులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. ఇరిగేషన్ ఆధీనంలో ఉన్నట్లు రికార్డులు చూపడం వల్లే వాటిని హోల్డ్‌లో పెట్టారు. రైతులు అందుకు ఆధారాలు చూపితే నోషనల్ ఖాతా ద్వారా సరిచేస్తాం.

సాక్షి: పోడు భూముల కేటాయింపు పూర్తయిందా..?

అడిషనల్‌కలెక్టర్: జిల్లాలో పోడు భూముల కోసం 5800 దరఖాస్తులందాయి. 75ఏళ్ల కాలంగా సాగుచేసుకుంటున్న గిరిజన రైతులకే ఆ భూములను కేటాయించాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా అందులో మంథని ప్రాంతానికి చెందిన కేవలం నలుగురినే అర్హులుగా గుర్తించాం.

సాక్షి: సింగరేణి ఏరియాలో చాలాఏళ్లుగా నివాసమున్న వారి ఇళ్లను క్రమబద్ధీకరిస్తారా..?

అడిషనల్‌కలెక్టర్: సింగరేణిలో అక్రమంగా జరిగిన ఆక్రమణలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాం. జీఓ 76 ప్రకారం వారి వద్ద ఉన్న ఆధారాలు, అర్హతల ఆధారంగా మాకు అందిన 3600 దరఖాస్తుల్లో 1100 మందిని అర్హులుగా నిర్ణయించాం.

సాక్షి: కస్టమ్ రైస్ మిల్లింగ్ ఇవ్వని మిల్లర్లపై చర్యలేంటి..?

అడిషనల్‌కలెక్టర్: జిల్లాలో సీఎంఆర్ నిబంధనలు పాటించని 36 మిల్లర్లను గుర్తించి నోటీసులిచ్చాం. నిబంధనల మేరకు వారంతా అప్పగించారు. సమస్య దాదాపు పరిష్కారమైంది.

సాక్షి: సివిల్‌సప్లయి గోదాంలో అవకతవకలపై...?

అడిషనల్‌కలెక్టర్: రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా చేసే సివిల్ సప్లయ్ గోదాంలో అవకతవకలకు పాల్పడిన ఇన్‌చార్జిని సస్పెండ్ చేశాం. ఆ వ్యవహారంపై విచారణ సాగుతోంది. డీలర్లకు ఇబ్బంది కలగకుండా గోదాం ఇన్‌చార్జి బాధ్యతలను తాత్కాలికంగా మరొకరికి అప్పగించాం.

సాక్షి: కింది స్థాయి అధికారుల పనితీరుపై..?

అడిషనల్‌కలెక్టర్: ప్రభుత్వ అధికారులు ప్రజాధనం నుంచి వేతనం పొందుతున్నామని గుర్తుంచుకోవాలి. కార్యాలయాలకు వచ్చే ప్రజలకు జవాబుదారీగా ఉంటూ బాధ్యతగా సేవలందిస్తే మంచి గుర్తింపు ఉంటుంది. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై పాలనాపరమైన చర్యలుంటాయి.

సాక్షి: ప్రజల నుంచి అందే ఫిర్యాదులపై..?

అడిషనల్‌కలెక్టర్: ప్రజలు ఫిర్యాదు చేసేముందు తమకున్న అర్హతలేంటీ..? అమలు సాధ్యం ఎంతవరకు అనే అంశాలపై కనీస అవగాహన కలిగి ఉండాలి. అమలు సాధ్యం కాని వాటి గురించి ఫిర్యాదులు, వినతులు ఇవ్వొద్దని సూచన.

విద్యార్థుల్లో పరిశీలనాత్మక శక్తిని పెంచాలి



ప్రదర్శనలను తిలకిస్తున్న కలెక్టర్ డాక్టర్ సంగీత

కలెక్టర్ సంగీత

జ్యోతినగర్: విద్యార్థుల్లో దాగి ఉన్న పరిశీలనాత్మక శక్తిని పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ సంగీత అన్నారు. ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని సెయింట్ క్లేర్ హైస్కూల్‌లో సైన్స్ ఎక్స్‌పో-2023 వైజ్ఞానిక, గణిత పర్యావరణ ప్రదర్శనను ప్రారంభించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ అభిరుచి, పరిశీలనాత్మక శక్తిని పెంచేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదం చేస్తాయని అన్నారు. ఆరోగ్యం-పరిశుభ్రత, రవాణా, గణిత నమూనాలు, పర్యావరణ హితమైన పదార్థాలు లాంటి 7 ఉప అంశాలతో ఏర్పాటు చేసిన ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు మొత్తం 162 ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. పాఠశాల హెచ్‌ఎం, జిల్లా సైన్స్ అధికారి రవినందన్‌రావు, రామగుండం కమిషనర్ సుమన్ రావు, ఎన్టీపీసీ అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

మన ఊరు మన బడితో మారిన రూపురేఖలు

రామగుండం: మన ఊరు మన బడితో పాఠశాలలు కార్పొరేట్‌ను తలదన్నే రీతిలో మారాయని కలెక్టర్ అన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాల, అక్బర్‌నగర్‌లోని ఉర్దూ మీడియం పాఠశాలలను సందర్శించారు. ఉపాధ్యాయులు మూస విధానం వీడి డిజిటల్ యుగంలోకి మారాలన్నారు. తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీఓ యాదగిరి, ఏఈ రాజు ఉన్నారు.

మనఊరు మనబడి పనులపై అసంతృప్తి

కోల్‌సిటీ: ఫైవింక్లయిన్ చౌరస్తా సమీపంలోని ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. మనఊరు-మనబడి నత్తనడకన సాగుతుండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మోడల్ పాఠశాలలను సంక్రాంతి వరకు ప్రారంభించేలా సిద్ధం చేయాలన్నారు. కమిషనర్ బి.సుమన్‌రావు, కార్పొరేషన్ ఈఈ మాధవి, ఇంజినీర్లు పాల్గొన్నారు.

రాజ్యభాష మాట్లాడుదాం..



బహుమతులు అందిస్తున్న ఈడీ సునిల్

జ్యోతినగర్: రాజ్యభాష హిందీలో భారతీయ సంస్కృతి, ఆదర్శవంతమైన జీవన శైలి ఉందని ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునిల్‌కుమార్ అన్నారు. ప్రపంచ హిందీ దినోత్సవం సందర్భంగా ఎన్టీపీసీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. హిందీని ప్రతిఒక్కరూ నేర్చుకుని మాట్లాడాలన్నారు. ఏజీఎం విజయలక్ష్మి ప్రధాని సందేశాన్ని చదివి వినిపించారు. హిందీ సీనియర్ సాహితీవేత్త రవీంద్ర శుక్లా హిందీభాష గొప్పతనాన్ని వివరించారు. హిందీని ప్రోత్సహించడంలో ఎన్టీపీసీ కృషిని సెంట్రల్ ఆఫీస్ అధికార భాషా విభాగం చైర్మన్ అతర్ సింగ్ గౌతమ్ అభినందించారు. హిందీ ఈ-మ్యాగజైన్ జ్యోతిస్వర్ ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందించారు. మెయింటెనెన్స్ జీఎం అలోక్ చంద్రఠాకూర్, కొంకణ్ రైల్వే డైరెక్టర్ సంతోష్ కుమార్‌ఝూ రచించిన కవితలను ఆలపించారు. సీజీఎం ప్రసేంజిత్ పాల్, జీఎంలు అవినాశ్ సరస్వత్, పుష్పేంద్రకుమార్ లాథ్, ఏకే.దేశాయ్, హరే రామ్ సింగ్, రవీంద్ర పటేల్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గాల ప్రబారీ, కన్వీనర్ల నియామకం

కరీంనగర్ టౌన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్ కుమార్ ఆదేశాల మేరకు కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాలకు ప్రబారీలు, కన్వీనర్లు, జాయింట్ కన్వీనర్లను నియమించినట్లు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పార్లమెంట్ ప్రభాస్ యోజన కన్వీనర్ జి.ప్రేమేందర్ రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గం ప్రబారీగా మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ప్రబారీగా అట్లుపురం విష్ణువర్ధన్ రెడ్డిని నియమించారు. కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్‌గా బోయినపల్లి ప్రవీణ్‌రావు, జాయింట్ కన్వీనర్లుగా ఎం.దశరథరెడ్డి, ఆడేపు రవీందర్, పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్‌గా పుదిల మల్లికార్జున్, జాయింట్ కన్వీనర్‌గా ఎస్.వెంకటేశ్‌గౌడ్‌ను నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

'కంటి వెలుగు'కు సర్వంసిద్ధం..!

- వంద రోజులకు ప్రణాళిక
- నేడు ప్రజాప్రతినిధులతో సమావేశం
- జిల్లావ్యాప్తంగా 34 బృందాలు
- జిల్లాకు చేరిన 14,600 కళ్లద్దాలు



శిక్షణ పొందుతున్న నేత్ర వైద్య సిబ్బంది



జిల్లా కేంద్రానికి చేరిన సామగ్రి

సుల్తానాబాద్: ఈనెల 18నుంచి నిర్వహించనున్న రెండోవిడత కంటివెలుగు కార్యక్రమానికి జిల్లా అధికార యంత్రాంగం పక్కా ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో వైద్య ఆరోగ్య శాఖ కీలక పాత్ర పోషించనుంది. కలెక్టర్ సంగీత ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్ కుమార్ కార్యాచరణ రూపొందించారు. పరీక్షలు చేసిన వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు తాత్కాలిక పద్ధతిన డాటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించారు. జిల్లా జనాభా ఆధారంగా శిబిరాలు నిర్వహించారు. మొత్తంగా 34 బృందాలు పనిచేయనున్నాయి. శిబిరాల్లో పాల్గొనే వైద్యులు, సిబ్బందికి వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

రంగంలోకి 34 బృందాలు..

జిల్లాలోని 266 గ్రామ పంచాయతీల్లో కంటి వెలుగు పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 34 బృందాలు పనిచేయనున్నాయి. ఇందులో రూరల్ ప్రాంతంలో 23, అర్బన్‌ప్రాంతంలో 11 టీంలను నియమించారు. వీరు 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు చేయనున్నారు. మొదటి విడతతో పోలిస్తే సుమారు లక్ష మందికి అదనంగా పరీక్షలు చేస్తారని తెలుస్తోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, కంటిశిబిరం వైద్యుడు, హెల్త్ ఎడ్యుకేటర్, నేత్ర వైద్య సిబ్బంది, ఫార్మసిస్టు, ఏఎన్‌ఎం, డాటా ఎంట్రీ ఆపరేటర్, ఆశా కార్యకర్తలు, ఎంపీహెచ్‌ఎస్ (సూపర్ వైజర్) ఉంటారు. ఎక్కడైనా అత్యవసరం ఉంటే అదనంగా బృందాలను నియమించే అవకాశముంది. వీరు ఆయా పీహెచ్‌సీల పరిధిలో సూచించిన గ్రామాలకు వెళ్లి కంటి పరీక్షలు చేయనున్నారు. పరీక్షలు చేయించుకున్న వారి వివరాలు, అద్దాల పంపిణీ వివరాలు వెంట వెంటనే డాటా ఎంట్రీ ఆపరేటర్ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. వైద్యాధికారి సూచనల ప్రకారం పాఠశాలలు, కమ్యూనిటీ హాల్‌లు, పంచాయతీ భవనాలు, ఇతర ప్రభుత్వ భవనాల్లో శిబిరాలు నిర్వహించనున్నారు. ప్రభుత్వ వాహనాలతో పాటు అద్దె వాహనాలు ఏర్పాటు చేసుకోనున్నారు.

ఇంటింటికీ ఆహ్వాన పత్రం

కంటి వెలుగు ఆహ్వానపత్రిక పత్రాన్ని రాష్ట్రప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ద్వారా ఇంటింటికీ అందజేయనుంది. పరీక్షలు చేయించుకునే వారు రేషన్, ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డు తెచ్చుకోవాలని అందులో ముద్రించారు. ఇందులో భాగంగా బుధవారం ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయనున్నారు.

ఏర్పాట్లు చేస్తున్నాం



కంటివెలుగు శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం. సిబ్బంది సహకారంతో ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తాం. డాక్టర్లు, సిబ్బందికి శిక్షణ ఇచ్చాం. ఇప్పటికే అన్నిరకాల పరికరాలు, యంత్రాలు 31 వచ్చాయి. మరో మూడు రావాల్సి ఉంది.

– డాక్టర్ మహేందర్, కంటివెలుగు నోడల్ ఆఫీసర్

ప్రజాప్రతినిధులతో సమావేశం



కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపడుతున్నాం. ఇందులో భాగంగా జిల్లాలోని ప్రజాప్రతినిధులకు బుధవారం జిల్లా కేంద్రంలో కంటి వెలుగుపై శిక్షణ ఇస్తున్నాం. కార్యక్రమానికి అందరూ హాజరై విజయవంతం చేయాలి.

– ప్రమోద్ కుమార్, డీఎంహెచ్‌వో

క్లుప్తంగా

ఉరేసుకుని ఆత్మహత్య


భూమయ్య మృతదేహం

జూలపల్లి(పెద్దపల్లి): మండలంలోని వడ్కాపూర్‌లో మంగళవారం ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. గ్రామానికి చెందిన కూనిరాజుల భూమయ్య(50) తన కూతురు వివాహం కోసం రూ.10లక్షల వరకు అప్పు చేశాడు. తనతో పాటు భార్య వీరమ్మ కూలీ పనులు చేసినా.. అప్పు తీరక పోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వీరమ్మ ఫిర్యాదుమేరకు ఎస్సై వెంకటకృష్ణ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ ఆడిట్ అమలులో మనమే టాప్

- అభ్యంతరాలపై సకాలంలో సమాధానాలివ్వాలి
- రాష్ట్ర ఆడిట్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావు


జిల్లా ఆడిట్ సిబ్బందితో సమావేశమైన డైరెక్టర్

పెద్దపల్లిరూరల్: ఆడిట్ ఆన్‌లైన్ చేయడంలో రాష్ట్రమే అగ్రభాగాన ఉందని రాష్ట్ర ఆడిట్ శాఖ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. జిల్లా కార్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. కార్యాలయ నిర్వహణ, ఆడిట్ అమలు చేస్తున్న తీరుపై చర్చించారు. రాష్ట్రంలోని 12,769 పంచాయతీలు, 540 మండల పరిషత్‌లు, 32 జిల్లా పరిషత్‌లలో ఆన్‌లైన్ పద్ధతిన ఆడిట్ పూర్తి చేశామన్నారు. 142 మున్సిపాలిటీల్లో ఇప్పటివరకు 65 మున్సిపాలిటీల్లో ఆడిట్ పూర్తయిందని పేర్కొన్నారు. ఇప్పటివరకు 1,98,000 అభ్యంతరాలను గుర్తించామని తెలిపారు. సమావేశంలో జిల్లా ఆడిట్ అధికారి రాజలింగం, రవి, మాధురి, కృష్ణమోహన్ తదితరులున్నారు.

అసంఘటిత కార్మికులకు కనీసవేతనం ఇవ్వాలి


మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

జ్యోతినగర్(రామగుండం): అసంఘటిత రంగ కార్మికులకు కనీసవేతనం రూ.26వేలు చెల్లించాలని రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ అధ్యక్షుడు గీట్ల లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు లేబర్ గేట్ వద్ద సీఐటీయూ జెండాను యాకూబ్ ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా గీట్ల లక్ష్మారెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు బెంగళూరులో సీఐటీయూ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి ఎం.రామాచారి, యాకూబ్, దండ రాఘవరెడ్డి, కాదశి మల్లేశ్, రవీందర్, శంకరయ్య, హుస్సేన్‌రెడ్డి, సాంబయ్య, అజయ్, సంతోశ్, పవన్, షకీల్ ఉన్నారు.

‘పుచ్చ’సాగుకు సమయమిదే..

- ఇసుక నేలల్లో పంటసాగు
- ఇప్పుడు విత్తనం వేస్తే వేసవిలో పంట
- అధిక ఉష్ణోగ్రతతో మంచి దిగుబడి
- కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త బి.భాస్కర్‌రావు


భాస్కర్‌రావు


సాగవుతున్న పుచ్చకాయ తోట


యాజమాన్య పద్ధతులు వివరిస్తున్న శాస్త్రవేత్తలు

రామగిరి(మంథని): పుచ్చకాయ సాగుకు ప్రస్తుతం అనుకూల సమయమని రామగిరి మండలం రత్నాపూర్ శివారులోని రామగిరి ఖిల్లా కృషి విజ్ఞాన (రైతు శిక్షణ) కేంద్రం శాస్త్రవేత్త బి.భాస్కర్ రావు సూచించారు. పుచ్చకాయలో తక్కువ క్యాలరీలు, ఏ, సీ విటమిన్ అధికంగా ఉంటాయని అన్నారు. దాహార్తిని తీర్చే గుణం ఉంటుందని, కాయ 90శాతం నీటిని కలిగి ఉండడంతో వచ్చేవేసవిలో అనేక పోషకాలు ఇస్తుందని తెలిపారు. పుచ్చసాగుకు అధిక ఉష్ణోగ్రత కలిగిన పొడి వాతావరణం అనుకూలం అన్నారు. ఉష్ణోగ్రత 18 డిగ్రీల కన్నా తగ్గితే పుచ్చమొక్క తట్టుకోలేదని, అందుకే ఎక్కువగా ఇసుకతిన్నెలు, నదిప్రాంతాల్లో సాగు చేస్తారని వివరించారు. పెద్దపల్లి జిల్లాలోని మానేరు, గోదావరి పరివాహక ప్రాంతంలో పుచ్చసాగు చేయవచ్చని రైతులకు సూచించారు.

ఇసుక నేలలు అనుకూలం

ఇసుక, రేగడి, మురుగు నీటివసతి కలిగిన నేలల్లో బోదెలు ఏర్పరిచి విత్తనాలు వేసుకోవాలి. డిసెంబర్ మూడోవారం నుంచి జనవరి మూడోవారం మధ్యలో విత్తనాలు వేసుకోవచ్చు. షుగర్ బేబీ, హస్య హి మాటో, అర్క జ్యోతి, అర్క మాణిక్, దుర్గాపూర్, కేసర్, దుర్గాపూర్ మీఠా విత్తనాలతో హైబ్రిడ్స్ రకాల్లో ఎస్ఎస్ 295, అపూర్వ, స్వీట్ డ్రాగన్, మాధురి, మధుబిందు, ఐస్‌బాక్స్ అనువైనవి. డు అడుగుల వెడల్పు ఉన్న నీటి కాలువలను రెండు మీటర్ల ఎడంతో తయారుచేసుకుని కాలువకు ఇరువైపుల అడుగు దూరంలో విత్తనాలు విత్తుకోవాలి. 500 నుండి 600 గ్రాముల విత్తనం ఎకరానికి సరిపడా చూసుకోవాలి. ఉష్ణోగ్రత తక్కువగా ఉన్నప్పుడు పాలిథిన్ సంచుల్లో (ఒక భాగం చొప్పున ఇసుక, ఎరువు, రెండు భాగాలు మట్టితో నింపినవి) విత్తుకోవాలి.

ఎరువులు ఇలా..

పంటకు బాగా మాగిన పశువుల ఎరువును ఎకరానికి 4 నుంచి 5 టన్నులు వేయాలి. 32 నుంచి 40 కిలోల భాస్వరం, 16 నుంచి 24 కిలోల పొటాష్, 40 కిలోల నత్రజని ఇచ్చే ఎరువులను వేయాలి. నత్రజని విత్తేప్పుడు, విత్తిన 25రోజుల తర్వాత రెండు దఫాలుగా వేయాలి. పంట ప్రథమదశలో ఒకసారి కాయ ఎదిగేదశలో మరోసారి నీటిని అందించాలి. కాయలు పక్వానికి వచ్చిన తర్వాత ఎక్కువ నీరు కట్టడం వల్ల కాయలు పగిలి నాణ్యత తగ్గే అవకాశముంది. పుచ్చపంట కలుపు నివారణకు ఎకరానికి 1.25 లీటర్లు పెండిమిథాలిన్ లేదా 200 లీటర్ల నీటిలో 10 లీటర్ల అలాక్లోర్ కలిపి నాటిన 24 నుండి 48 గంటల లోపు పిచికారీ చేయాలి. రెండు నుంచి నాలుగుదశలలో రెండు గ్రాముల డై సోడియం, ఆక్టాబోరెట్ మందును లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయడం ద్వారా దిగుబడి పెరుగుతుంది. పూత రావడానికి ముందు తీగ చివర్ల ఉంచడం వలన ఒక తీగ అభివృద్ధి చెంది దిగుబడి పెరుగుతుంది. ఎంచుకున్న రకాన్ని బట్టి ఎకరానికి 60 నుంచి 80 టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

సిమెంట్ డీలర్లకు ముగ్గుల పోటీలు


విజేతలకు బహుమతులు అందిస్తున్న సిమెంట్ కంపెనీ ప్రతినిధులు

పాలకుర్తి(రామగుండం): కేశోరాం ఇండస్ట్రీస్-బిర్లాశక్తి సిమెంట్ వారి ఆధ్వర్యంలో మంగళవారం బసంత్‌నగర్‌లో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల సిమెంట్ డీలర్లకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈపోటీలను తెలంగాణ స్టేట్ సేల్స్ అండ్ మార్కెటింగ్ హెడ్ నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిర్లాశక్తి సిమెంట్ ఎల్లప్పుడు డీలర్ల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని కార్యకలాపాలను నిర్వహిస్తుందని, నాణ్యమైన సిమెంట్‌ను అందించడంలో ఎల్లప్పుడు ముందుంటుందని అన్నారు. అనంతరం ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కేశోరాం ప్లాంట్‌హెడ్ శ్రీనివాసరెడ్డి, కరీంనగర్ బ్రాంచ్‌హెడ్ అనిల్‌కుమార్ వర్మతో పాటు సేల్స్ అండ్ మార్కెటింగ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈజ్ ఆఫ్ లివింగ్ సర్వేలో నాలుగో స్థానం

- సత్తాచాటిన రామగుండం కార్పొరేషన్



కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థ ఈజ్ ఆఫ్ లివింగ్ ఇండెక్స్‌పై అవగాహన కల్పించే కార్యక్రమాల్లో దేశంలోని నగరాల్లో 4వ స్థానంలో నిలిచింది. కేంద్ర ప్రభుత్వం అర్బన్ అవుట్ కమ్ ఫ్రేమ్ వర్క్స్‌లో భాగంగా ఈజ్ ఆఫ్ లివింగ్ ఇండెక్స్‌పై దేశంలోని పలు నగరాలల్లో పౌరుల అభిప్రాయాలపై సర్వే నిర్వహించింది. ప్రజలకు అవగాహన కల్పించే అంశంలో దేశంలోని నగరాల్లో రామగుండం నగరపాలక సంస్థ 4వ స్థానంలో నిలిచి సత్తా చాటింది. ప్రథమ స్థానంలో అగర్తల, ఆగ్రా, ఆలీఘర్, బెంగళూరు తదితర 35 నగరాలు చోటు దక్కించుకోగా, రెండవ స్థానంలో డయ్యూ, మూడవ స్థానంలో మీరట్, నవీముంబాయ్, మొరాదాబాద్, కాన్పూర్, నాలుగవ స్థానంలో రామగుండంతోపాటు ఫిర్జాదిగూడ, కరీంనగర్, ఖమ్మం నగరపాలక సంస్థలు నిలిచాయి. కాగా, రామగుండం ఉత్తమ ర్యాంకు సాధించడానికి కృషి చేసిన మున్సిపల్ డెప్యూటీ కమిషనర్, అర్బన్ అవుట్ కమ్ ఫ్రేమ్ వర్క్స్ నోడల్ అధికారి నారాయణరావును, సహకరించిన సిబ్బందిని రామగుండం నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, కమిషనర్ సుమన్‌రావు అభినందించారు.


రాష్ట్రంలో 13 కార్పొరేషన్లలో...

కేంద్ర గృహ పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ దేశంలోని 262 నగరాల్లో నివసిస్తున్న ప్రజల జీవన ప్రమాణాల సూచికగా, ‘ఈజ్ ఆఫ్ లివింగ్ ఇండెక్స్-2022’ పేరుతో పౌరుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు ఆన్‌లైన్ సర్వే(సిటిజన్ పర్సెప్షన్ సర్వే) నిర్వహించింది. రాష్ట్రంలోని రామగుండం, కరీంనగర్, వరంగల్, ఫీర్జాదిగూడా, హైదరాబాద్, ఖమ్మం, నిజామాబాద్, నిజాంపేట్, జవహర్‌నగర్, బడంగ్‌పేట, బోడుప్పల్, బండ్లగూడ, మీర్‌పేట్ నగరపాలక సంస్థల్లో కేంద్రం సర్వే చేపట్టింది. 17 అంశాలపై వివరాల సేకరణకు సర్వే నిర్వహించారు. అర్బన్ అవుట్ కమ్స్ ఫ్రేమ్ వర్క్-2022లో భాగమైన నగరాల్లో నగరస్థాయి కార్యకలాపాలపై పౌరుల్లో అవగాహన పెంపొందించి, వారిని భాగస్వాములను చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగింది. ఇందులో రామగుండం దేశంలోని మిగితా నగరాల్లో మెరుగైన ఫలితాలను సాధించడంపట్ల నగర పాలకవర్గం, అధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.









మొగి పురుగు మింగేస్తోంది

వరిని ఆదిలోనే మొగి పురుగు మింగేస్తోంది. ఏ రైతు నోట విన్నా.. మొగి పురుగు మాటే.. దీనికితోడు ఆకుపచ్చ పురుగు బాధ పెడుతోంది. పెద్దపల్లి మండలం కాసులపల్లి, కనగర్తి శివారులో సాగు చేసిన వరి మొగిపురుగు ఆశించి ఇలా కనిపించాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

సింగరేణి వార్తలు

కార్మికుల పక్షాన ఏఐటీయూసీ


గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సమ్మయ్య

రామగిరి(మంథని): సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ అలుపెరగని పోరాటం చేస్తోందని ఆ సంఘం కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య పేర్కొన్నారు. సింగరేణి సంస్థ ఆర్జీ-3 పరిధి ఓసీపీ-2లో మంగళవారం గేట్‌మీటింగ్ మాట్లాడారు. సంస్థలో రోజురోజుకు రాజకీయ జోక్యం పెరిగిపోతోందని అన్నారు. దీంతో సంస్థకు తీరనినష్టం వాటిల్లుతోందని అన్నారు. కాంట్రాక్టీకరణ, ప్రైవేటీకరణ పేరుతో ప్రభుత్వాలు దోపిడీకి పాల్పడుతున్నాయని దుయ్యబట్టారు. 11వ వేతన ఒప్పందంలో ఏఐటీయూసీ కీలకప్రాత పోషించిందని వివరించారు. ఇతర అలవెన్సులు, ఇంక్రిమెంట్లు, ఎల్‌టీసీ, ఎల్ఎల్‌టీసీ వంటి వాటి గురించి త్వరలోనే నిర్వహించనున్న సమావేశంలో చర్చించి కార్మికులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. కార్మికుల సమస్యలు కేవలం ఏఐటీయూసీ ద్వారానే పరిష్కారం అవుతాయని దీనిని దృష్టిలో పెట్టుకుని రానున్న గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో కార్మికులు ఏఐటీయూసీకి అండగా నిలవాలని ఆయన కోరారు. ఫిట్ సెక్రటరీ ఎంఆర్‌సీ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ వైవి.రావు, ట్రేడ్స్‌మెన్ సెక్రటరీ మర్రి రాజు, అసిస్టెంట్ బ్రాంచి సెక్రటరీ నర్సింగరావు ఉన్నారు.

హక్కుల సాధనకు నిరంతర పోరాటం


గేట్‌మీటింగ్‌లో మాట్లాడుతున్న తుమ్మల రాజారెడ్డి

గోదావరిఖని: సింగరేణి కార్మికుల హక్కుల సాధనలో సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తోందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జీడీకే-2వ గనిపై జరిగిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. దేశంలోని కార్మికుల హక్కుల రక్షణ కోసం ముందుండి ఐక్య పోరాటలకు సీఐటీయూ సిద్ధం చేస్తోందన్నారు. సీఐటీయూ జాతీయ 17వ మహాసభలు ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు బెంగళూరులో జరుగుతాయని అన్నారు. మహాసభల్లో దేశంలోని కార్మికవర్గంతో పాటు బొగ్గు గని కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు, బొగ్గు బ్లాక్‌ల ప్రైవేటీకరణ ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాలు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చించడం జరుగుతుందని అన్నారు. రాష్ట్రం నుంచి 62 మంది, దేశంలోని 29 రాష్ట్రాల నుండి మొత్తం 1500 మంది ప్రతినిధులుగా హాజరవుతున్నారని తెలియజేశారు. నాయకులు మెండె శ్రీనివాస్, కారం సత్తయ్య, ఆసరి మహేశ్, సీహెచ్ వేణుగోపాల్‌రెడ్డి, ఆరెపల్లి రాజమౌళి, వంగల రాములు, దాసరి సురేశ్, అయిత శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న అశోక్

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం స్పందించి సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్జీ-2 ఏరియా పోతన కాలనీ జోన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. 2016లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుప్రకారం సమాన పనికి సమాన వేతనాలు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రమేశ్, వెంకటస్వామి, సులోచన, పద్మ, ఎల్లక్క, కమల, రాజేశం, గంగమ్మ, మధునయ్య ఉన్నారు.

‘అధికారులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదు’


వినతిపత్రం అందజేస్తున్న అధికారుల సంఘం నాయకులు

గోదావరిఖని: రిటైర్మెంట్ సమయంలో అధికారులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని అధికారుల సంఘం నాయకులు మంగళవారం ఆర్జీ-1 జీఎం కె.నారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ మధ్య సవరించిన ఎగ్జిక్యూటివ్ క్యాడర్ రూల్స్-2021 ప్రకారం ఎలాంటి ఎంక్వైరీలు చేపట్టకుండానే సీఎంపీఎఫ్, ఎడీసీపీఎస్, సీపీఆర్ఎంఎస్, పెన్షన్ చెల్లింపులు నిలిపివేయడం వల్ల అధికారులు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. కోల్ ఇండియాలో లేని కొత్త నిబంధనలు సింగరేణిలో అమలు చేయడం మూలంగా అధికారుల్లో అసంతృప్తి పెరుగుతోందన్నారు. దీనిపై యాజమాన్యం సమీక్షించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఎంఓఏఐ అధ్యక్షులు పానాగోటి శ్రీనివాస్, కార్యదర్శి డేవిడ్, సీనియర్ పీఓ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

కోలిండియా పోటీల్లో సత్తా చాటాలి


క్రీడాకారులను అభినందిస్తున్న జీఎం ఎ.మనోహర్

గోదావరిఖని: కోలిండియా పోటీల్లో సత్తాచాటి సింగరేణి కీర్తిపతాకాన్ని ఎగురవేయాలని ఆర్జీ-2 జీఎం ఎ.మనోహర్ పేర్కొన్నారు. మంగళవారం జీఎం కార్యాలయంలోని తన చాంబర్‌లో మందమర్రిలో జరిగిన కంపెనీస్థాయి లాన్‌టెన్నిస్ పోటీల్లో గెలుపొంది కోల్ ఇండియా పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులు జే.శ్రీమాన్, బెక్కం రవి, బి.సంజీవ్, వెటరన్ పోటీలలో గెలుపొందిన ఎస్.రమేశ్, ఎ.వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్‌రెడ్డిని జీఎం అభినందించారు. డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, మురళీకృష్ణ, సీనియర్ పర్సనల్ అధికారి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను బడికి పంపండి: డీఈవో



కౌన్సెలింగ్ ఇస్తున్న డీఈవో

పెద్దపల్లిరూరల్: తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపించాలని, లేకుంటే వారి భవిష్యత్తు అంధకారం అవుతుందని డీఈవో మాధవి అన్నారు. జిల్లాకేంద్రంలోని శాంతినగర్ ప్రాంతం ఎస్సారెస్పీ కాలువ గట్టుపై నివాసముండే వారి ఇళ్లలో బడికి వెళ్లని ఇద్దరు అమ్మాయిలను గుర్తించారు. వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి ఇద్దరినీ కేజీబీవీ పాఠశాలలో చేర్పించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో ఉచిత విద్య, దుస్తులు, భోజనం అందుతోందని, వసతిగృహాలను సైతం ప్రభుత్వం ఏర్పాటు చేసిందని వివరించారు. సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఎంఓపీఎం శేఖ్, సీఆర్పీ బాలసాని వెంకటేశం, ఐఈఆర్పీ సంధ్యారాణి ఉన్నారు.

ప్రయోగశాలలను వినియోగించుకోండి

కమాన్‌పూర్: ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సంచార విజ్ఞాన గణిత ప్రయోగశాలలను విద్యార్థులు వినియోగించుకోవాలని డీఈవో విద్యార్థులకు సూచించారు. కమాన్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న గణిత ప్రయోగశాలను మంగళవారం పరిశీలించారు. విద్యార్థులకు శాస్త్రీయ అభిరుచి పరిశీలనాత్మక ధోరణి పెంపొందించాలనే లక్ష్యంతో కలెక్టర్ ప్రత్యేక చొరవతో సంచార గణిత ప్రయోగశాలలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షల్లో 10 జీపీఏ సాధించాలని సూచించారు. అనంతరం గుండారం ప్రభుత్వ పాఠశాలను సందర్శించి మనఊరు మనబడి కార్యక్రమంలో చేపట్టిన పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్పీలు మల్లేశ్వరరావు, సత్యనారాయణ, సుమన్, రవీందర్, రాజయ్య, శ్రీనివాస్, రాజేశ్వర్ రావు ఉన్నారు.

బొగ్గు బ్లాకుల ప్రయివేటీకరణపై ఉద్యమం


మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని: బొగ్గు బ్లాకుల ప్రయివేటీకరణపై ఉద్యమానికి సిద్ధమవుతున్నట్లు ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ స్పష్టం చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ.. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సపోర్టు చేయలేదా అని ప్రశ్నించారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రేవంతర్‌రెడ్డి బొగ్గు బ్లాకుల అమ్మకాలపై పార్లమెంట్‌లో మాట్లాడారన్నారు. బొగ్గు బ్లాకుల విక్రయాల వల్ల కార్మిక కుటుంబాలు రోడ్డుపాలైయ్యే అవకాశం ఉందన్నారు. ఎంఎండీఆర్ రెగ్యులేషన్ యాక్ట్‌ప్రకారం కోయగూడెం బొగ్గు బ్లాకుల ప్రయివేటీకరణ సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ, ఐఎన్‌టీయూసీ యూనియన్ ఆధ్వర్యంలో బొగ్గు బ్లాకుల విక్రయాలకు వ్యతిరేకంగా ఉద్యమానికి సిద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 29న కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ సభ్యులు ఈ సమస్యపై పార్లమెంట్‌లో పోరాడుతారన్నారు. సమావేశంలో నాయకులు ధర్మపురి, లక్ష్మీపతిగౌడ్, కె.సదానందం, గడ్డం క్రిష్ణ, గుండేటి శ్రీనివాస్, ఎట్టం క్రిష్ణ, బర్ల మనోహర్, తాటి రాజయ్య, అల్లావుద్దీన్, ఆంజనేయులు, రాజేశం, అనిల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.